కథ

# యం.రమేష్ కుమార్

# అంతరంగాలు

సాయంత్రపు గాలి చల్లగా పలకరిస్తోన్న వేళ. సూర్యం, నేనూ మా డాబా మీద ఎదురెదురు కుర్చీల్లో కూర్చొని ఉన్నాం.

"నీతో మాట్లాడాల్సిన పనుంది" అని సూర్యం చెప్పిన దగ్గర్నుంచీ అదేమై ఉంటుందా అని ఆలోచిస్తున్నాను.

సూర్యం నా బెస్ట్ ఫ్రెండ్. సూర్యం తండ్రి దశరథరామయ్యగారు ఈమధ్యనే చనిపోయారు. నిద్రలోనే హార్ట్ ఎటాక్. రాత్రి ఎప్పుడు చనిపోయారో కూడా తెలీదు. తెల్లవారి చూసేసరికి ఆయన ఈ లోకంలో లేరు. ఆ షాక్ సూర్యం కుటుంబ సభ్యుల్ని బాగా కృంగదీసింది.

దశరథరామయ్యగారు స్కూల్ టీచర్‌గా పనిచేసేవారు. ఆయన రిటైర్ కావడానికి ఇంకా సంవత్సరం టైముంది. ఆయన దిగులంతా ఎప్పుడూ సూర్యం గురించే. సూర్యం నా క్లాస్‌మేట్. ఇంచుమించు మా స్నేహితులంతా ఏదో రకంగా స్థిరపడ్డారు. నేను కూడా బేంక్ జాబ్ సంపాదించుకోగలిగాను. సూర్యం మాత్రం ఇప్పటివరకూ స్థిరపడలేకపోయాడు. రెండు మూడు ప్రైవేటు జాబ్‌లు చేసినా ఏ ఉద్యోగాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. సూర్యం షార్ట్ టెంపర్, ముక్కుసూటి తత్వం దీనికి కారణాలని వాణ్ని ఎరిగిన వాళ్లందరూ అంగీకరిస్తారు.

సూర్యం చెల్లెలు సులోచన పెళ్లి కోసం అయిన అప్పులు ఇంకా ఆ కుటుంబానికి భారంగానే ఉన్నాయి. తన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో ఆ అప్పులు తీర్చేసినా సూర్యం భవితవ్యం ఏమిటనేది దశరథరామయ్యగారిని వేధించేది. కొడుకు ఏ ఉద్యోగంలోనూ స్థిరపడలేకపోవడం ఆయన్ని అమితంగా బాధించేది. దాంతో ఆయనకి సూర్యం మీద ఎప్పుడూ కోపంగానే ఉండేది. వాళ్లిద్దరి మధ్య తరచూ తీవ్రమైన వాగ్యుద్ధాలు జరిగేవనే సంగతి నాకు తెలుసు.

దశరథరామయ్యగారి మరణం తరువాత ఆ కుటుంబానికి దగ్గరివాళ్లు, తెలిసినవాళ్లు కూడా ఓ మాట అనుకోవడం నా చెవిన పడింది. అదేమిటంటే మునలాయన చనిపోయి కుటుంబానికి మేలు చేశాడని!

సర్వీసులో ఉండగా చనిపోయాడు కాబట్టి కొడుక్కి ఉద్యోగం వస్తుంది. వచ్చే బెనిఫిట్స్‌తో అప్పులు తీరిపోతాయి. అంతేకాదు సూర్యం తల్లి సావిత్రమ్మకు ఫేమిలీ పెన్షన్ కూడా వస్తుంది. ఇదీ అందరూ ఆ విధంగా భావించడానికి కారణం.

ఇవన్నీ ఎలా ఉన్నప్పటికీ ఒక మనిషి మరణంతోనే ఆ కుటుంబం ఒడ్డున పడిందని అనుకునే దౌర్భాగ్య పరిస్థితులకు కారణం ఏమిటి? మిగతావాళ్లతో బాటు ఆ కుటుంబ సభ్యులు కూడా అలాగే భావిస్తే దానిక్కారణం మనిషి మీద ప్రేమ కన్నా భవిష్యత్ మీది భయమే అధికమయ్యేలా చేస్తున్న సామాజిక పరిస్థితులా? లేక కుటుంబ బంధాలు క్రమక్రమంగా వ్యాపారబంధాలుగా మారిపోతూ ఉండడమా? నా మనసులో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

"ఏమిటి? ఆలోచనల్లో మునిగిపోయినట్టున్నావ్?" సూర్యం పిలుపుతో ఆలోచనల్లోంచి తేరుకొన్నాను.

సూర్యం మొహంలోకి చూస్తే ఏదో చెప్పాలనుకొని చెప్పలేకపోతున్నట్టుగా అనిపించింది.

"ఏదో మాట్లాడాలన్నావ్? సంగతేమిటి?" అడిగాను.

సూర్యం మౌనం వహించాడు.

"నా దగ్గర చెప్పడానికి నీకు మొహమాటం ఏమిత్రా?" సూర్యం వైపే చూస్తూ అన్నాను. మామధ్య ఎలాంటి అరమరికలూ ఉండవు. నాతో చెప్పడానికి కూడా సంకోచించే విషయం ఏమై ఉంటుందో నాకర్థం కాలేదు.

"ఎలా చెప్పాలో తెలీడం లేదురా.. కానీ నీతో చెప్పుకోకపోతే ఈ బాధ పెరిగిపోయి భరించే శక్తి కోల్పోయేలా ఉన్నాను" తడబాటుగా అన్నాడు సూర్యం.

"ఏమిత్రా.. ఏమైంది నీకు?" సంగతేమిటో చెప్పమన్నట్టుగా అడిగాను.

"విషయం నీకు తెలియాలంటే నాన్నగారు చనిపోవడానికి రెండు రోజులు ముందు జరిగిన సంగతి నీకు చెప్పాలి" ఎటో చూస్తూ అన్నాడు.

చెప్పుమన్నట్లుగా చూశాను.

సూర్యం చెప్పడం ప్రారంభించాడు.

ooo

ఆ రోజు సాయంత్రం.

సూర్యం దిగులుగా ఇల్లు చేరాడు. కాన్వెంట్‌లో టీచర్‌గా దొరికిన ఉద్యోగం కూడా ఆ రోజే పోయింది.

రాత్రి తొమ్మిదింటి వరకూ స్టడీ అవర్స్ చెప్పాలన్నాడు ప్రిన్సిపాల్. "అదేమిటి.. జాయినైనప్పుడు ఆ మాట చెప్పలేదు కదా" అన్నాడు సూర్యం. అంతే ప్రిన్సిపాల్‌కు కోపం వచ్చేసింది. 'ప్రశ్నలు వేయొద్దనీ, ఇష్టం ఉంటే చెయ్యమనీ లేదా మానెయ్యవచ్చనీ' అన్నాడు. వాళ్లిచ్చే జానా బెత్తెడు జీతానికి కూడా ఎగబడి, వాళ్లు చెప్పినట్టు నడిచే కాండిడేట్స్ దొరక్కపోరని ఆయన ధీమా. అంతమాట అనిపించుకున్నాక కూడా స్వాభిమానం చంపుకొని ఇంకా అక్కడే పనిచేయలేక వచ్చేశాడు సూర్యం.

సులోచన కూడా ఆ సమయంలో పుట్టింట్లోనే ఉంది. జరిగింది చెప్పబోయేసరికి పూర్తిగా వినకుండానే సులోచనా, సావిత్రమ్మా ఇద్దరూ సూర్యాన్నే తప్పుబట్టడం మొదలుపెట్టారు. సూర్యం ఈ రకంగా ఉద్యోగాలు పోగొట్టుకోవడం ఇది మొదటిసారి కాదు. అదీ వాళ్ల ఆక్రోశం.

"నీకు జన్మలో స్థిరపడే యోగం లేనట్టుంది" విసురుగా అంది సావిత్రమ్మ.

తల్లి మాటలకు సూర్యానికి కోపం వచ్చింది.

"ఎందుకురా అన్నయ్యా నాన్నని ఇంకా బాధపెడతావ్. ఆయన చూస్తే రిటైర్మెంట్‌కి దగ్గరయ్యారు. నీ గురించిన బెంగతోనే ఆయన ఆరోగ్యం పాడుచేసుకొంటున్నారు" తల్లికి మద్దతుగా అంది సులోచన.

"వీడెందుకమ్మా ఆయన గురించి ఆలోచిస్తాడు? వీడి స్వభావం ఇంక మారదు. వీడి గురించిన ఆలోచనలతోనే ఆయనకి ఈమధ్య బి.పి. బాగా పెరిగిపోయింది. ఆయన్ని క్షోభ పెట్టి చంపితే గానీ వీడికి మనశ్శాంతి ఉండదు" మండిపడుతూ అంది సావిత్రమ్మ.

సూర్యానికి కోపం పెరిగిపోయింది. "అవును. ఆయన బాధంతా నా గురించే. నేనేం మాట్లాడినా ఏనాడైనా తిన్నగా వినిపించుకున్నారా? ఎప్పుడూ నాదే తప్పన్నట్లు మాట్లాడతారు. బిజినెస్ చేస్తాను. మీ ష్యూరిటీ సంతకంతో బేంక్ లోను ఇప్పించండి. తర్వాత నేనే తీర్చుకుంటానంటే. నువ్వు బిజినెస్ చెయ్యగలవనే నమ్మకం నాకు లేదనంటారు. నేనసలు

ఎందుకూ పనికిరాని వాణ్నని ఆయన అభిప్రాయం. ఆయనకి బి.పి. ఎక్కువైతే దానిక్కారణం నేనేనా? ఛావమను.. ఆయన ఛస్తే అలాగైనా నాకు ఉద్యోగం వస్తుంది" ఆవేశంతో ఎగిసిపడుతూ అన్నాడు సూర్యం.

అతని మాటలకు సావిత్రమ్మ, సులోచన నిశ్చేష్టులై చూస్తూ ఉండిపోయారు.

సూర్యానికి తను ఆవేశంలో ఎంత మాటన్నాడో అన్న తర్వాత గానీ అర్థం కాలేదు.

"అమ్మా..సారీ! ఏదో కోపంలో.. నా బాధ.." అంటూ ఏదో చెప్పబోతూ అప్పుడే గుమ్మంలోంచి వస్తున్న దశరాథరామయ్యని చూసి మాటలు రానట్టు నిలబడిపోయాడు.

దశరథరామయ్య మొహం గంభీరంగా ఉంది. ఆయన సూర్యం మాటలు విన్నాడా? లేదా? అక్కడున్న వారికి అర్థం కాలేదు.

ఆయన తన మాటలు విన్నాడేమో అన్న ఆలోచనతో సూర్యం గుండెలు దడదడలాడాయి.

దశరథరామయ్యగారేమీ మాట్లాడకుండానే ఇంట్లోకి వెళ్లిపోయారు.

రాత్రి భోజనం వడ్డిస్తున్నప్పుడు సావిత్రమ్మ ఆయనతో కొడుక్కి ఉద్యోగం పోయిన సంగతి చెప్పింది. ఆయనేమీ సమాధానం ఇవ్వలేదు. సూర్యం విషయంలో ఇలా జరగడం మామూలే అనుకున్నారో లేక సూర్యం మాటల్ని విని ఉండటం వల్ల అది మనసులో ఉండి మాట్లాడలేదో వాళ్లకి అర్థం కాలేదు.

సరిగ్గా ఈ సంఘటన జరిగిన మూడోరోజు రాత్రి ఆయన చనిపోయారు.


* * *

అక్కడి వరకూ చెప్పి ఆపాడు సూర్యం.

సూర్యం ఎందుకంతగా మధనపడుతున్నాడో నాకు అవగతం అవుతోంది.

సూర్యం మళ్లీ చెప్పడం కొనసాగించాడు.

"నాన్న చనిపోయిన రోజు నుంచీ ఈ విషయమే ఆలోచిస్తూ నాలో నేను నలిగిపోతున్నా. ఆ రోజు ఆయన నా మాటలు విని మనసులో పెట్టుకొని ఆ బాధతో ఈ విధంగా జరిగిందేమో అన్న అనుమానం నన్ను తొలచేస్తోంది. అంతకంటే విషాదం ఏమిటంటే... నాన్నగారికి అప్పుడప్పుడు నిద్రమాత్రలు వేసుకునే అలవాటు ఉంది. ఆయన మనోవ్యధ భరించలేక నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నారేమో అన్న ఆలోచన నన్ను పిచ్చెక్కిస్తోంది. అంతేకాదు ఇలా జరగడానికి నువ్వే కారణం అన్నట్టుగా అమ్మా, చెల్లీ చూసే చూపులు కూడా భరించలేకపోతున్నాను'' సూర్యం మొహంలో అంతులేని వేదన తాండవిస్తోంది.




సూర్యం మనోవేదన నాకర్థమైంది. కానీ వాడి మనసులోని అనుమానం ఎలా తీరుతుంది? ఏం చెప్పి వాణ్ని కన్విన్స్ చేయాలి?

నా వంతు ప్రయత్నంగా వాణ్ని సమాధానపరచాలని చూశాను. నీ అనుమానాలన్నీ అర్థరహితమనీ, ఆయనది సహజ మరణమేననీ, నీ మాటలు ఆయన విని ఉంటే కోపంతో వెంటనే రియాక్టై ఉండేవారనీ. కాబట్టి ఆయన విని ఉండరనీ అన్నాను. అయినా నువ్వు ఏదో ఆవేశంలో అన్నావు తప్ప నిజంగా నీ మనసులోంచి వచ్చిన మాటలు కాదు కదా అని నచ్చజెప్పాను. జరగాల్సింది ఎలాగైనా జరిగి తీరుతుందనీ, దాన్నెవరూ తప్పించలేరనీ కర్మసిద్ధాంతాన్ని చెప్పాను. ఎన్ని చెప్పినా సూర్యం సమాధానపడినట్టుగా నాకనిపించలేదు. సూర్యం మాట ఎంత కటువో మనసు అంత సున్నితం. ఆ సంగతి వాడి స్నేహితుడిగా నాకు బాగా తెలుసు.

ఆ వారంలో రెండు మూడుసార్లు సూర్యాన్ని కలిశాను. వాడు ఆ విషయాన్ని మనసులోంచి తీసెయ్యలేక దాని గురించే ఆలోచిస్తూ మధనపడుతున్నాడన్న సంగతి నాకు అర్థమవుతూనే ఉంది.

మరో ఇరవై రోజులు గడిచాయి. సూర్యం వేదనంతా వాడి మొహంలోనే ప్రతిఫలిస్తోంది. ఎప్పుడు చూసినా మనిషి పరధ్యానంగా ఉన్నట్టుంటాడు. వాణ్ని చూస్తే జాలేస్తోంది. కానీ ఏం చెయ్యగలను?

రెండు రోజుల తరు

వాత ఓ సాయంకాలం అర్జెంటుగా రమ్మన్న నా పిలుపుతో సూర్యం మా ఇంటికి వచ్చాడు.

సూర్యం వచ్చేసరికి నా ఎదురుగా ఓ వ్యక్తి కూర్చొని ఉన్నాడు. అతని పేరు ప్రభాకర్. జిల్లా పరిషత్ ఆఫీసులో అకౌంట్స్ సెక్షన్ ఆఫీసర్. రెండు నెలల క్రితమే ఈ ఊళ్లో జాయినయ్యాడు. ప్రభాకర్ నాకు మంచి స్నేహితుడు. హౌసింగ్ లోన్ కోసం మా బేంక్‌లో అప్లయ్ చేద్దామనుకొంటున్నాడు. వివరాలు తెలుసుకోవడం కోసం నా దగ్గరికొచ్చాడు.. ఆ విషయాలన్నీ సూర్యానికి చెప్పి ప్రభాకర్‌ని పరిచయం చేశాను.

"మీ నాన్నగారు ప్రభాకర్‌కి తెలుసట. తను చిన్నప్పుడు ఆయన దగ్గర చదువుకొన్నాడట. చనిపోయే ముందు రోజు మీ నాన్నగారు ప్రభాకర్‌ని కలిశారట. ఆ విషయాలు చెప్తూ ఉంటే నువ్వు వింటే బాగుంటుందని నీకు ఫోన్ చేసి రమ్మన్నాను" అంటూ ఆపాను.

సూర్యం ప్రభాకర్ వైపు ఆసక్తిగా చూశాడు.

ప్రభాకర్ చెప్పడం మొదలుపెట్టాడు.. "అవునండీ.. మీ నాన్నగారి పి.ఎఫ్. ఎకౌంట్‌లో కొన్ని రాంగ్ ఎంట్రీస్ పడ్డాయి. అవి సరి చేయించుకోవడానికి ఆయన ఆఫీస్‌కి వచ్చారు. ఆయన్ని చూసి నేనే గుర్తుపట్టి పలకరించాను. ఆయన కూడా నన్ను పోల్చుకొని మంచి స్థితిలోకి వచ్చినందుకు సంతోషించారు. కొంత సేపు మాట్లాడుకొన్నాం. ఆయన మీ గురించి చెప్తూ ప్రస్తుతం ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. నేను నాకు తెలిసిన ఓ కంపెనీలో జాబ్స్ ఖాళీ ఉన్నాయనీ, ఆ ఎం.డి. నాకు బాగా తెలుసుననీ తప్పకుండా పోస్టు ఇప్పించడానికి ప్రయత్నం చేస్తానని చెప్పాను. కొంతసేపు మాట్లాడుకొన్నాక ఆయన వెళ్తూ వెళ్తూ ఎలాగైనా మా అబ్బాయికి పోస్టు వచ్చేలా చూడమని మరీమరీ రిక్వెస్టు చేసి వెళ్లారు. ఆ మరుసటి రోజే ఆయన హార్ట్ ఎటాక్‌తో పోయారన్న విషయం నాకు చాలా ఆలస్యంగా తెలిసింది. నిజంగా ఇది నేను నమ్మలేకపోయాను" సానుభూతి వ్యక్తం చేస్తూ అన్నాడు ప్రభాకర్.

మరికొద్దిసేపు లోన్ గురించిన వివరాలు నన్నడిగి తెలుసుకొన్న తర్వాత "సూర్యానికి త్వరగా పోస్టింగ్ వచ్చే విషయంలో నా వంతు సహాయం చేస్తాను" అని హామీ ఇచ్చి ప్రభాకర్ వెళ్లిపోయాడు.

అతను వెళ్లాక సూర్యాన్ని అడిగాను. "సూర్యం.. ప్రభాకర్ చెప్పింది విన్నాక అది నువ్వు కూడా తెలుసుకోవాల్సిన విషయం అనిపించి వెంటనే నీకు రమ్మని ఫోన్ చేశాను. నేనేం చెప్పాలనుకుంటున్నానో ఈపాటికి నీకు అర్థమైందనుకుంటాను"

సూర్యం మొహంలో ఏదో సందిగ్ధత..



"సూర్యం.. ఇంకా నీకు అర్థం కాలేదా? ఇన్ని రోజులుగా నువ్వు భావిస్తున్నట్టు మీ నాన్నగారు ఆ రోజు నీ మాటలు వినడం జరగనే లేదు. అదే జరిగి ఉంటే ఆయన నీ మీద బాగా కోపంతో ఉండి ఉండాలి. అలాంటప్పుడు ఆయన చనిపోయే ముందు రోజు నీ ఉద్యోగం కోసం ప్రభాకర్‌ని మరీమరీ రిక్వెస్ట్ చేయడం ఎలా జరుగుతుంది? అంతే కాదు. ఒకవేళ ఆయనకే గనుక ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన ఉంటే అప్పుడు కూడా నీ ఉద్యోగం కోసం ఆయన ప్రభాకర్‌ను రిక్వెస్ట్ చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే తను సర్వీసులో ఉండగా చనిపోతే నీకు ఉద్యోగం వస్తుందన్న సంగతి ఆయనకు తెలుసు కదా. ఇక నీ పిచ్చి ఆలోచనలన్నీ కట్టిపెట్టు సూర్యం. ఆయనది సహజ మరణం. దానికెవరు చేసేది మాత్రం ఏముంది?" తీవ్రంగా అన్నాను.

సూర్యం మొహంలో మారుతున్న భావాలు నేను గమనించగలుగుతున్నాను. అంతకుముందు నుంచీ పట్టి పీడిస్తున్న దయ్యమేదో వదలిపోయిన రిలాక్స్ వాడి మొహంలో కనిపిస్తోంది.

మేము కొద్దిసేపు మాట్లాడుకొన్న తరువాత సూర్యం వెళ్లిపోయాడు.

సెక్షన్ ఆఫీసర్ ప్రభాకర్ నా స్నేహితుడన్న మాట నిజం. అతను మా ఇంటికొచ్చింది బేంక్ లోన్ విషయంలోనే అన్న మాట కూడా నిజం. కానీ దశరథరామయ్య తనను కలిసినట్లు, సూర్యం ఉద్యోగ విషయమై మాట్లాడినట్లు ప్రభాకర్ చెప్పిన విషయాలు మాత్రం నిజం కాదు. సూర్యం మనోవేదన తొలగించే ప్రయత్నంలో ప్రభాకర్ సహాయంతో నేను ఆడిన నాటకం అది. ఈ విషయంలో ప్రభాకర్‌కి కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

మరణించిన దశరథరామయ్య మనసులో ఏముందో నాకు తెలీదు. కానీ సూర్యం మనసులో రేగుతున్న మంటల్ని ఆర్పడానికి ప్రయత్నించడం నా విధి. సూర్యం ఇంక ఆ విషయాన్ని గురించి మర్చిపోయి మళ్లీ ఎప్పటిలా సంతోషంగా ఉంటాడన్న ఆలోచనే నా మనసుకు సంతృప్తిగా అనిపిస్తోంది.

## నమితకి గుడి?

*తమిళ సినీ ప్రేక్షకుల రూటే సెపరేటు. ఆమధ్య హీరోయిన్ కుష్బూ కోసం గుడి కట్టి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అది తీసేసార్లెండి. అలాగే సిమ్రాన్ హీరోయిన్‌గా వీరవిహారం చేస్తున్న రోజుల్లో ఆమె విగ్రహం పెట్టి గుడి కట్టడానికి అభిమానులు చేసిన ప్రయత్నాలు సిమ్రాన్ కాదనడం వల్ల ఆగాయి. తాజాగా తమిళనాట క్రేజీ హీరోయిన్ నమితకి గుడి కట్టడానికి అభిమానులు రెడీ అయి ఆ సంగతి ఆమెకి చెప్పారట. అయితే నమిత మాత్రం అలాంటి పనులేమీ చేయవద్దని, ఇంతగా అభిమానిస్తున్నందుకు కృతజ్ఞతలు అంటూ ఆ ప్రయత్నాన్ని విరమింపచేసిందిట.*